
సాక్షి
అనంతపురం
మంగళవారం, 26, ఆగస్టు, 2025



టమాట కిలో రూ.28

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.28 పలికింది.



కాగితాల్లోనే పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫలితాలు ఇవ్వడం లేదు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు.

8లో



జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తన్నుకున్న 'తమ్ముళ్లు'



దాడిలో తీవ్రంగా గాయపడ్డ టీడీపీ నాయకుడు సూర్యనారాయణ

ఉరవకొండ/ఉరవకొండ రూరల్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో 'తెలుగు తమ్ముళ్లు' రచ్చకెక్కారు. ఒకరిని ఒకరు తన్నుకున్నారు. సోమవారం ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆనంద్ వర్గాలు ఘర్షణకు దిగాయి. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ టీడీపీ నాయకుడు సూర్యనారాయణ తెలిపిన మేరకు.. ఆమిద్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీని మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ నిర్వహిస్తోంది. భోజన సరఫరాలో లోటుపాట్లు ఉన్నాయని ఇటీవల ఆనంద్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై సోమవారం పాఠశాల హెచ్ఎం రామాంజనేయులతో చర్చిస్తున్న సమయంలో మాజీ ఎంపీపీ వర్గీయులు అక్కడకు చేరుకుని వాగ్వాదానికి దిగారు. అంతలోనే మాజీ ఎంపీపీ సోదరుడు సూర్యనారాయణ అక్కడ చేరుకోగా ఆగ్రహించిన ఆనంద్ వర్గీయులు బడిలో గంట కొట్టే ఇనుపరాడ్‌తో ఆయన తలపై బలంగా కొట్టారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

జిల్లాకు 1,022 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: యూరియా రాక కోసం వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ ఎదురు చూస్తోంది. రైతులు రోడ్డెక్కుతున్న నేపథ్యంలో సోమవారం స్పిక్ కంపెనీ నుంచి వస్తుందని భావించినా... యూరియా స్థానంలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయి. రెండు మూడు రోజుల్లో యూరియా సరఫరా అవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతానికి జిల్లాలో ఎక్కడా యూరియా రైతులకు లభించే పరిస్థితి లేదు. ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలు, డీసీఎంఎస్ గోదాములు ఖాళీ కాగా ప్రైవేట్ హోల్‌సేల్, రీటైర్ల దగ్గర ఖాళీ అయినట్లు చెబుతున్నారు. 1,016 మెట్రిక్ టన్నులు బఫర్‌స్టాకు ఉండగా.. డిమాండ్ ఉన్న రాప్తాడు, బొమ్మనహాళ్, ఉరవకొండ మండలాల్లోని కొన్ని ఆర్‌ఎస్‌కేలకు అందులో 300 మెట్రిక్ టన్నులకు పైగా సరఫరా చేశారు. ప్రస్తుతం 700 మెట్రిక్ టన్నులు బఫర్‌స్టాక్ ఉన్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. రెండు మూడు రోజుల్లో యూరియా వచ్చే అవకాశం ఉందన్నారు. సోమవారం ఇఫ్కో కంపెనీ నుంచి 1,022 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్ తెలిపారు. 815 మెట్రిక్ టన్నులు డీఏపీ రాగా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అందులో 500 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు, మిగతా 315 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాగే 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు 207 మెట్రిక్ టన్నులను ఇండెంట్ మేరకు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

రైతాంగ సమస్యలు పట్టవా?





మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భరత్, చిత్రంలో మంత్రి కేశవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

- జిల్లాకు చేరిన యూరియా ఏమైంది?
- ఎరువులు దొరక్క సామాన్య రైతులు విలవిల్లాడుతున్నారు
- డీఆర్‌సీ సమావేశంలో ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి
- యూరియా ఎక్కువే సరఫరా చేశామన్న మంత్రి కేశవ్

అనంతపురం: 'యూరియా దొరక్క రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. జిల్లా అంతటా నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. బడా బాబులకే యూరియా దొరుకుతోంది. సామాన్య రైతులకు యూరియా దొరకని దౌర్భాగ్య పరిస్థితిని ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నాం' అని ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం నిర్వహించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామి రెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి, అమిలినేని సురేంద్రబాబు, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శివరామి రెడ్డి జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఏకరువు పెట్టారు. వచ్చిన యూరియా అంతా ఎక్కడికి వెళ్తోందో అర్థం కావడం లేదన్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న రైతులకు యూరియా జాడే లేదన్నారు. కొందరు వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిందనే అనుమానం వ్యక్తమవుతోందన్నారు. తాము సూచించిన విధంగా పురుగుల మందులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని రైతులను వ్యాపారులు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. 'యూరియా దొరక్క రైతులు పంటలు వేయడం లేదు. గడువు ముగిసిపోతోంది. ప్రత్యామ్నాయంగా ఏ ప్రాంతంలో ఏ పంట సాగు చేయాలనే అంశంపై రైతులకు ఎందుకు చెప్పడం లేదు' అంటూ నిలదీశారు. ఎమ్మెల్సీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. ప్రజాప్రతినిధులు కూడా సరైన సమాధానం చెప్పలేక దాటవేశారు. యూరియా పక్కదారి పట్టిన అంశంపై విచారణ చేస్తామని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. మరోవైపు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి ఇచ్చిన సమయం అయిపోయిందంటూ మైకు లాక్కునే ప్రయత్నం చేయగా.. ఎమ్మెల్సీ దీటుగా బదులిచ్చారు. జీడిపల్లి రిజర్వాయర్ బాధితులకు ఇప్పటి దాకా న్యాయం చేయలేదని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతుండగా మైక్ లాక్కొంటున్న ఎంపీ బీకే పార్థసారథి

8.5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాకు పరిశ్రమలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ప్రజాప్రతినిధులు ఇచ్చిన లేఖలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్లతో పరిశ్రమలను ఏర్పాటు చేయబోతున్నామని, వాటి ద్వారా 8.5 లక్షల ఉద్యోగాలు కల్పించనున్నామని చెప్పారు.

యూరియా ఎక్కువే కేటాయించాం..

మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాది కన్నా పంటల సాగు తగ్గిపోయిందన్నారు. గతంలో కంటే తమ ప్రభుత్వం 5 వేల మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా కేటాయించినా ఎక్కడ తక్కువ వస్తోందనే అంశంపై తెలుసుకోవాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏ సొసైటీ కూడా తప్పు చేయడానికి వీలు లేదన్నారు. జిల్లాలో ప్రతి చెరువుకూ నీరు అందించాలన్నారు. హంద్రీ-నీవా కాలువ, మడకశిర కెనాల్, బీటీపీ ప్రాజెక్టులు అన్నింటిని పూర్తి చేసేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు.

పెన్షన్లు వెంటనే పునరుద్ధరించాలి

డీఆర్సీ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్లను రీవెరిఫికేషన్ పేరుతో తొలగించారన్నారు. నిర్దాక్షిణ్యంగా పెన్షన్లు తొలగించి వారిని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారన్నారు. వెంటనే పెన్షన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పీఎం కిసాన్ నిధులు జమ అవుతున్నా అన్నదాత సుఖీభవ కింద నిధులు జమ కావడం లేదన్నారు. అర్హులైన వారికి సాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ ప్రైవేట్ షాపులకు ఎక్కువ యూరియా ఇస్తున్నారన్నారు. డీసీఎంఎస్‌కు యూరియా ఇచ్చి రైతులకు సక్రమంగా అందించాలని కోరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువ కింద గొలుసు కట్టు చెరువులకు నీరు అందించాలని కోరారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా రేమాండ్స్ పరిశ్రమను ప్రారంభించాలన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువ ద్వారా గుంతకల్లు నియోజకవర్గంలోని 12 చెరువులకు నీరు అందించాలన్నారు. శింగనమల ఎమ్మెల్యే శ్రావణి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో మూడు మండలాల్లో యూరియా కొరత ఉందన్నారు. పుట్లూరు-యల్లనూరు పరిధిలోని బొప్పేపల్లి చెరువుకు నీళ్లు అందించాలన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉందని, స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సులను ఆయా ప్రాంతాలకు వర్తింపజేయాలని కోరారు. హంద్రీ-నీవా 36బీ ప్యాకేజీలో నిధులు కేటాయిస్తే 15 వేల ఎకరాలకు నీరందించవచ్చన్నారు.

దారి కాచిన మృత్యువు

- ఆనందం.. అంతలోనే విషాదం
- కుమార్తెను చూసి వస్తూ తిరిగిరాని లోకాలకు తండ్రి
- ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు వ్యక్తుల దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం



నజీర్‌బాషా(ఫైల్)



షేక్ బాబాఫక్రుద్దీన్ (ఫైల్)

వజ్రకరూరు: 15 రోజుల క్రితం జన్మించిన తన కూతురును చూడాలని ఆ తండ్రి అనుకున్నాడు. వెంటనే మిత్రులతో కలిసి ద్విచక్ర వాహనంలో అత్తారింటికి వెళ్లాడు. కూతురును చూసిన అనంతరం సంతోషంగా స్వగ్రామానికి తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యంలో ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఇదే ప్రమాదంలో అతనితో పాటు మరొక వ్యక్తి చనిపోగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన వజ్రకరూరు మండల పరిధిలో జరిగింది. వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి తెలిపిన వివరాల మేరకు... పామిడి పట్టణానికి చెందిన షేక్ బాబాఫక్రుద్దీన్‌కు ఉరవకొండకు చెందిన ఫర్హానాబేగంతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 15 రోజుల క్రితం కుమార్తె జన్మించింది. ఆదివారం సాయంత్రం కుమార్తెను చూడటానికి బాబాఫక్రుద్దీన్ (32) తన మిత్రులు నజీర్‌బాషా (20), ఫారూక్ అలియాస్ మహమ్మద్ రఫీలతో కలిసి ద్విచక్రవాహనంలో పామిడి నుంచి ఉరవకొండలోని అత్తారింటికి వెళ్లారు. రాత్రి ఉరవకొండ నుంచి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలోని వజ్రకరూరు సమీపంలోని మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందకు పడింది. నజీర్‌బాషా అక్కడికక్కడే మృతిచెందాడు. బాబాఫక్రుద్దీన్, ఫారూక్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం బాబాఫక్రుద్దీన్ మరణించాడు. ఫారూక్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. మృతుడు నజీర్‌బాషా తండ్రి హాజీవలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ-25కు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు తెలిపారు. అనంతపురం రూరల్ ఆలమూరు రోడ్డులో ఉన్న బాలాజీ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని సోమవారం జిల్లా పరిశీలకులు సుబ్బారావు పరిశీలించారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి సర్టిఫికెట్ జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. అభ్యర్థులు వారి వ్యక్తిగత లాగిన్ ఐడీల ద్వారా మంగళవారం మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులైతే వైకల్య ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడుసెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఎంపిక పూర్తిగా మెరిట్, అర్హత, రిజర్వేషన్ నియమ నిబంధనల మేరకే జరుగుతుందని స్పష్టం చేశారు. వారి వెంట విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్ తదితరులున్నారు.

8.2 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్

అనంతపురం: గుట్టుగా విద్యార్థులకు విక్రయిస్తున్న 8.2 కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. అనంతపురంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన షికారి ఆంజనేయులు భార్య షికారి నాగమణి, షికారి గంగులు కుమారులు షికారి శీనా, షికారి జునలు స్థానిక టీవీ టవర్ సమీపంలోని ఎన్టీఆర్ కాలనీ మసీదు వద్ద గంజాయి విక్రయాలు చేపడుతున్నారు. కొన్ని రోజులుగా ఇంజినీరింగ్, మెడికల్ కళాశాల, ఇంటర్ విద్యార్థులు వీరి నుంచి గంజాయి కొంటున్నారు. సోమవారం ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు.. నిందితులు ముగ్గురినీ అరెస్టు చేశారు. మూడు సంచుల్లో 8.291 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి సుహాసిని, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం. సత్యనారాయణ, ఎస్ఐలు నరేష్ బాబు, జయనరసింహ, జాకీర్ హుస్సేన్, సిబ్బంది మారుతి, రమేష్ రెడ్డి, మీనా లక్ష్మి, నాగముని పాల్గొన్నారు.

కళ్లులేని ప్రభుత్వం.. కనికరం లేని సీఎం



వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న నాయకులు, దివ్యాంగులు



దివ్యాంగులతో కలిసి కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు

- పింఛన్ల తొలగింపుపై భగ్గుమన్న దివ్యాంగులు
- ధర్నాలతో అట్టుడికిన కలెక్టరేట్

అనంతపురం అర్బన్: పింఛన్ల తొలగింపుపై దివ్యాంగులు భగ్గుమన్నారు. కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. అర్హులైన దివ్యాంగులకు పింఛను తొలగించిన కళ్లులేని ప్రభుత్వం... కనికరం లేని ముఖ్యమంత్రికి తమ ఉసురు తగిలి తీరుతుందంటూ శాపనార్థాలు పెట్టారు. రీ వెరిఫికేషన్ పేరిట తొలగించిన పింఛన్లు తక్షణం పునరుద్ధరించాలంటూ దివ్యాంగుల సంఘాలు వేర్వేరుగా సోమవారం చేపట్టిన నిరసనలు, ధర్నాలతో కలెక్టరేట్ అట్టుడికిపోయింది. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం నాయకులు, దివ్యాంగులు కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు, దివ్యాంగులు కలెక్టరేట్ ఎదురుగా రోడ్డుకు ఒకవైపున.. భారతీయ భీమ్ సేన ఆధ్వర్యంలో నాయకులు, దివ్యాంగులు కలెక్టరేట్ ఎదురుగా రోడ్డుకు మరో వైపు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్డుకు రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో డీఆర్‌ఓ మలోల అక్కడికి చేరుకుని నాయకులతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ పింఛను అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో నాయకులు ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.


- వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నాయకులు, దివ్యాంగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తొలగించిన దివ్యాంగ పింఛన్లు పునరుద్ధరించాలన్నారు. వెరిఫికేషన్ పేరిట దివ్యాంగులను ఇబ్బంది పెడితే సహించబోమన్నారు. దివ్యాంగుల ఆర్థిక, సామాజిక, మానసిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గాల అధ్యక్షులు పాతలింగ, వడ్డే ఆంజనేయులు, అంజనయ్య, ఫక్రుద్దీన్, ఎస్‌కే కాలేషా, తదితరులు పాల్గొన్నారు.
- వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో సమితి జిల్లా అధ్యక్షుడు జానకిరామయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేపీ మధు మాట్లాడుతూ తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి మహిళా అధ్యక్షురాలు జయమ్మ, నాయకులు తిప్పేస్వామి, రంగనాథ్, శ్రీనివాసులు, రామాంజినేయులు, రఘునాథ్, తిప్పేస్వామి, స్వతంత్ర కుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.
- దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గమంటూ భారతీయ భీమ్ సేన ఆధ్వర్యంలో నాయకులు, దివ్యాంగులు కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, వ్యవస్థాపకుడు రామాంజినేయులు మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు వేలల్లో ఉన్నారని, వారి పింఛన్లు పునరుద్ధరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుల్లాయప్ప, ఓబుళపతి, పుల్లన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన ఆందోళన



రహదారిపై ఆందోళన చేస్తున్న దివ్యాంగులు, వైఎస్సార్ సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అన్యాయంగా దివ్యాంగుల పింఛన్లు తొలగించడంపై బీకేఎస్ మండలంలో ఆందోళనలు మిన్నంటాయి. సోమవారం మండల కేంద్రంలో దివ్యాంగులు పెద్ద ఎత్తున తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. అనంతపురం-తాడిపత్రి రహదారిపై బైఠాయించారు. వీరికి వైఎస్సార్ సీపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే దివ్యాంగుల పొట్ట కొట్టడం దుర్మార్గమన్నారు. ఈ ప్రభుత్వానికి దివ్యాంగుల ఉసురు తప్పక తగులుతుందన్నారు. ఆందోళన చేస్తున్న దివ్యాంగులు, నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరి కూటి కాటమయ్య, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, కాటమయ్య, నిమ్మల భాస్కర్, చికెన్ నారాయణస్వామి, రాజారెడ్డి, నాగేశ్వరరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

క్లుప్తంగా

నెట్టికంటుడి హుండీ కానుకల లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 85.99 లక్షల ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఆలయ ఈఓ ఎం.విజయరాజు తెలిపారు. సోమవారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. 70 రోజులకు గానూ రూ. 85,74,111 నగదు, అన్న దానం హుండీ ద్వారా రూ.25,063 నగదును భక్తులు సమర్పించారు. అలాగే 0.039 గ్రాముల బంగారు, 2.400 కిలోల వెండి సమకూరింది. హుండీ కానుకల లెక్కింపును ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.రాణి, ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన వీరభద్ర సేవా సమితి, హనుమాన్ సేవా సమితి, రాఘవేంద్ర సేవా సమితి, శ్రీరామ సేవాసమితి సభ్యులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్యురాలికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు: ద్విచక్రవాహనంపై వెళుతూ కిందపడిన ఘటనలో స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పుష్పలత తీవ్రంగా గాయపడ్డారు. ఉదయం 9:30 గంటలకు మండలంలోని మొళకతాళ్ల గ్రామంలో 104 సేవలు అందించడానికి ఆమె వెళ్లారు. మధ్యాహ్నం 104 వాహన డ్రైవర్‌తో కలసి ద్విచక్ర వాహనంపై పీహెచ్‌సీకి తిరుగు ప్రయాణమైన ఆమె చిత్రచేడు జెడ్పీహెచ్ఎస్ వద్ద అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మొళకతాళ్లలో ఉన్న సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని 104 వాహనంలో ఆమెను పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

'పరిష్కార వేదిక'కు 60 వినతులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 60 వినతులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా పాల్గొన్నారు.

కాగితాల్లోనే పరిష్కారం

- క్షేత్రస్థాయిలో ప్రయోజనం శూన్యం
- అధికారుల చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- మొక్కుబడి తంతుగా 'పరిష్కార వేదిక'


ఈ వృద్ధుని పేరు కె.అరవిందు. కూడేరు మండలం శివరాంపేట గ్రామం. ఉరవకొండ మండలం మైలరాంపల్లి పొలం సర్వే నంబరు 304లోని ఇతని ఆరు ఎకరాల భూమి పీఏబీఆర్ ముంపులో పోయింది. ఇందులో రెండు ఎకరాలకు పరిహారం ఇచ్చారు. నాలుగు ఎకరాలకు ఇవ్వలేదు. దీంతో ఏడాదిగా అధికారులకు అర్జీ ఇస్తూనే ఉన్నాడు. అయితే ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సోమవారం మరోసారి అర్జీ ఇచ్చేందుకు అనంతపురంలోని కలెక్టరేట్‌కు వ్యయప్రయాసలకోర్చి వచ్చాడు. ఈయనొక్కరే కాదు.. జిల్లాలో చాలా మందిది ఇదే పరిస్థితి. సమస్యలు పరిష్కారం కాక బాధితులు పడుతున్న వేదన వర్ణనాతీతంగా ఉంటోంది.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీల పరిష్కారం కాగితాల్లో కనిపిస్తోంది. అదీ కూడా 90 శాతానిపైగా ఉన్నట్లు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నమైన పరిస్థితి ఉంది. నెలలుగా అర్జీలు ఇస్తూనే ఉన్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన చెందున్నారు. విసిగిపోయిన బాధితులు కొందరు 'పరిష్కార వేదిక'లో అధికారులతో గొడవలకు దిగిన సందర్భాలు చాలా ఉన్నాయి.

ఆ శాఖలోనే అధికం..

ప్రధానంగా రెవెన్యూ శాఖ పరిధిలో సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. భూ సమస్యలపై అధికంగా అర్జీలు అందుతున్నాయి. వీటిలో 10 శాతం కూడా పరిష్కారం కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అర్జీకి ఎండార్స్‌మెంట్ ఇస్తూ సమస్యను పరిష్కరించినట్లు చూపిస్తుండడం గమనార్హం. దీంతో ప్రజలు ఆ ఎండార్స్‌మెంట్‌ను పట్టుకుని మళ్లీమళ్లీ పరిష్కార వేదికకు వచ్చి అర్జీ సమర్పించుకుంటున్నారు. ఇలా నెలలుగా తిరుగుతున్నవారే అధికంగా ఉన్నారు.

కాళ్లరిగేలా అధికారుల చుట్టూ...

సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాలు, అధికారులు చుట్టూ ప్రజలు కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి కనిపిస్తోంది. తిరిగితిరిగి వేసారిపోతున్నామే తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. మండల కార్యాలయాల్లో కొందరు కనీస మర్యాద కూడా ఇవ్వకుండా దురుసుగా మాట్లాడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పరిష్కార వేదిక కార్యక్రమం మొక్కుబడి తంతుగా మారిందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పరిష్కార వేదిక కార్యక్రమంలో గత ఏడాది జూన్ 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు 45,035 అర్జీలు రాగా 40,610 పరిష్కరించినట్లుగా చూపిస్తున్నారు. అయితే, వాస్తవంగా అర్జీల్లో 40 శాతం కూడా పరిష్కారం కాలేదని తెలిసింది.

'పరిష్కార వేదిక'లో 516 వినతులు

సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఎఫ్ఎస్‌ఓ రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, తిప్పేనాయక్, మల్లికార్జునుడు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 516 వినతులు అందాయి.

15, జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు అందిన అర్జీలు

మొత్తం అర్జీలు	పరిష్కరించినట్లుగా చూపుతున్నది
45,035	40,610

ప్రధాన శాఖల్లో అర్జీలు ఇలా

శాఖ	అందిన అర్జీలు	పరిష్కరించినట్లుగా చూపుతున్నది
రెవెన్యూ	17,345	14,916
సర్వే భూరికార్డులు	9,989	9,530
పోలీసు	5,190	4,850
మునిసిపల్	2,156	1,872
పంచాయతీరాజ్	1,571	1,352
సాంఘిక సంక్షేమ	1,121	1,082
పౌర సరఫరాలు	834	7,98

దిక్కు తోచడం లేదు


మా కళాశాలలో దాదాపు 200 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది. ప్రస్తుతం రాలేదు. దీంతో మమ్మల్ని పై సెమిస్టర్‌కు రిజిస్ట్రేషన్ చేయడం లేదు. ఒక్కొక్కరు మూడు రోజుల్లోపు రూ.52,148 చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని కళాశాల యాజమాన్యం చెప్పింది. అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలి. కట్టకపోతే ఆరు నెలలు ఖాళీగా ఉండాలి.

– జి.అజయ్‌కుమార్, విద్యార్థి, శ్రీ కృష్ణదేవరాయ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్

చాలా సార్లు అర్జీ ఇచ్చా


పక్షపాతం కారణంగా మంచానికే పరిమితయ్యా. కుటుంబసభ్యులు నన్ను ఆటోలో పడుకోబెట్టుకుని కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. పింఛను కోసం ఏడాదిన్నర క్రితం దరఖాస్తు చేసుకున్నా. చాలా సార్లు అర్జీ ఇచ్చినా మంజూరు కాలేదు. కలెక్టర్‌ను కలిసి మరోసారి అర్జీ ఇచ్చి ఆదుకోవాలని విన్నవించుకున్నాం.

– గోపాల్, తరిమెల గ్రామం, శింగనమల మండలం

బతకడం కష్టం


నాకు 57 సంవత్సరాలు. చేతికర్ర లేనిదే నడవలేను. 11 ఏళ్లగా పింఛను వస్తోంది. 75 శాతం వైకల్యం ఉన్నట్లు అప్పట్లో సర్టిఫికెట్ ఇచ్చారు. అయితే ఈ నెలలో పింఛను నిలిపేశారు. ఇదేమని అడిగితే రీ వెరిఫికేషన్‌లో 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందన్నారు. పింఛను నిలిపివేస్తే బతకడం చాలా కష్టంగా ఉంటుంది.

– శంకరయ్య, కల్లూరు, గార్లదిన్నె మండలం

ఆ బాలికలు బడిలో ఉండాలి :కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..


భిక్షాటన చేస్తున్న బాలికలను గుర్తించిన ఐసీడీఎస్, పంచాయతీ అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్/సిటీ: 'బడి ఈడు బాలికలు భిక్షాటన, చిత్తు పేపర్లు సేకరించుకుంటూ జీవనం సాగించడం ఏమిటి? ఆ అమ్మాయిలందరూ బడిలో ఉండాల్సిందే' అంటూ సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. 10 నుంచి 12 ఏళ్ల మధ్య వయసున్న బాలికలు అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి, కక్కలపల్లి కాలనీ పంచాయతీ కళ్యాణదుర్గం రోడ్డు నరిగిమ్మ ఆలయ సమీపంలో భిక్షాటన చేయడం, చిత్తు పేపర్లు సేకరిస్తున్న వైనంపై 'ఇదేనా బాలికాభావృద్ధి' శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. విచారణకు ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. పీడీ ఆదేశాలతో రాచానపల్లి సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి గాయత్రి, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫి, ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్ మంజుభార్గవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ టి.వెంకట్‌కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ సుహాసిని, స్థానిక అంగన్‌వాడీ వర్కర్ బృందంగా ఏర్పడి రంగంలో దిగారు. రాచానపల్లి ఎంపీపీ స్కూల్ వెనుక వైపు గుడారాలు వేసుకున్న వారితో మాట్లాడారు. భిక్షాటనకు వెళ్తున్న నలుగురు బాలికలు వారి పిల్లలే అని నిర్ధారించుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నలుగురిలో ఇద్దరు బాలికలు 5వ తరగతి వరకు చదువుకోగా, మరో అమ్మాయి 6వ తరగతి వరకు చదువుకుంది. ఇంకో అమ్మాయిని పాఠశాలకే పంపలేదని తెలుసుకున్నారు. ఇద్దరు బాలికలకు 'తల్లికి వందనం' డబ్బు కూడా జమ అయినట్లు గుర్తించారు. వలసల కారణంగా చదివించుకోలేక పోతున్నామని తల్లిదండ్రులు వాపోయారు. పిల్లలను చదివిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వారి చదువులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఉద్యోగులు తెలిపారు. ఆడపిల్లలను భిక్షాటనకు పంపితే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆడపిల్లల భద్రత విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి కేజీబీవీల్లో చదువుకునే అవకాశం కల్పించాలని స్థానికులు కోరారు. తల్లిదండ్రులు వలస వెళ్లినా రెసిడెన్షియల్ స్కూళ్లల్లోనైతే ఆ పిల్లలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీడీ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఐసీడీఎస్ ఉద్యోగులు తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమొద్దు

- కూటమి ప్రభుత్వంపై ఎస్ఎఫ్ఐ నాయకుల ధ్వజం
- కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా
- ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి
- మెస్‌చార్జీలు రూ.3 వేలకు పెంచాలి


కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

అనంతపురం అర్బన్: విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడాన్ని మానుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలు పట్టించుకోని సీఎం డౌన్‌డౌన్, విద్యాశాఖ మంత్రి డౌన్‌డౌన్ అంటూ నాయకులు, విద్యార్థులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, మెస్‌చార్జీ రూ.3 వేలకు పెంచాలని, తదితర డిమాండ్లతో ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు, విద్యార్థులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరి, పరమేష్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా విద్యారంగ సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి రూ.6,400 కోట్లు తక్షణమే విడుదల చేస్తామని యువగళంలో లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇచ్చిన హామీని అమలు చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని మండిపడ్డారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వసతిగృహాల్లో మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన ట్రంకు పెట్టెలు, బెడ్‌షీట్‌లు, దోమల తెరలు, ఇతరరాత్ర సామగ్రి అందజేయాలన్నారు. జీఓ 77 రద్దు చేసి, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, సూర్యప్రకాష్, అరుణ్, రషీద్, నవీన్‌యాదవ్, సోము, సాయి, విజయ్, నాగభూషణ్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మారణాయుధాలతో దాడి


తీవ్రంగా గాయపడిన యువకుడు

ఆత్మకూరు: భూవివాదంలో రెండు వర్గాలుగా విడిపోయి మారణాయుధాలతో దాడి చేసుకోవడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం భానుకోట, కొండపల్లి గ్రామాలకు చెందిన వారికి ఆత్మకూరు మండలం గొరిదిండ్ల రెవెన్యూ పరిధిలో పొలాలు ఉన్నాయి. కొంత కాలంగా భానుకోట, కొండపల్లి గ్రామాలకు చెందిన వారి మధ్య భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సోమవారం గొరిదిండ్ల సమీపంలోని వారి భూమిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గొడ్డళ్లతో పరస్పర దాడులు చేసుకోవడంతో వెంకటేష్, రఘు, భూపతి, రామదాసుతో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం ద్వారా అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

పామిడి: ప్రమాదవశాత్తు ఆటో నుంచి కిందపడి ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడి మండలం జి.కొట్టాల గ్రామానికి చెందిన చిన్న నారాయణ (55) సోమవారం వ్యక్తిగత పనిపై పామిడికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం ఆటోలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను డ్రైవర్ తప్పించబోయి ఆటోకు సడన్ బ్రేక్ వేయడంతో అందులో ఉన్న చిన్న నారాయణ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

2 టన్నుల యూరియా సీజ్


యూరియా బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: స్థానిక కేజీఎం ఆగ్రో ఏజెన్సీలో అక్రమంగా నిల్వ చేసిన 2.070 టన్నుల యూరియాను సీజ్ చేసినట్లు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లీనా వసుంధర తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సీఎసీడీటీ సుబ్బలక్ష్మి, వ్యవసాయ శాఖ, పోలీసులు బృందంగా ఏర్పడి సోమవారం ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. కేజీఎం ఆగ్రో ఏజెన్సీలో ఎలాంటి రికార్డులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన యూరియాను గుర్తించి సీజ్ చేశామన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

యల్లనూరు: మండలంలోని కల్బూరు గ్రామానికి చెందిన మాదిక చిన్న రెడ్డప్పపై దాడి చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన కురుబ నవీన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు యల్లనూరు ఎస్ఐ రామాంజనేయ రెడ్డి తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఈ నెల 22న ఎస్.కొత్తపల్లి గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు హాజరైన చిన్న రెడ్డప్ప, కురుబ నవీన్ మద్యం మత్తులో డీజే ఆర్కెస్ట్రాలో చిందేశారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన సమయంలో నవీన్ కట్టెతో దాడి చేసి, ఇంటి వదిలి నవీన్ వెళ్లిపోయాడు. గుర్తించిన చిన్న రెడ్డప్ప భార్య గంగాదేవి వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లింది. ఘటనపై బాధితుడి సోదరుడు పెద్ద రెడ్డప్ప చేసిన ఫిర్యాదు మేరకు కురుబ నవీన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యూరియా పంపిణీపై విజిలెన్స్ ఆరా


రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బొమ్మనహాళ్: యూరియా దాచి పెట్టినా... బ్లాక్ మార్కెట్‌కు తరలించినా చర్యలు తప్పవని రైతు సేవా కేంద్రం సిబ్బందిని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. యూరియా కొరతపై 'యూరియా.. ఏదయ్యా' శీర్షికన ఈ నెల 18న 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఉన్నతాధికారులు విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించారు. దీంతో సోమవారం బొమ్మనహాళ్‌లోని రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ ప్రక్రియ, రికార్డులను విజిలెన్స్ సీఐ జమాల్‌బాషా, సిబ్బంది పరిశీలించారు. ఉంతకల్లు క్రాస్, శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాల్లో ఎరువుల దుకాణాలనూ తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన యూరియా సరైన సమయంలో, సరైన ధరకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సజావుగా సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

అనంతపురం: సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం సజావుగా సాగింది. అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో చేపట్టిన ఈ ప్రక్రియకు మొత్తం 488 మంది అభ్యర్థులకు గాను 470 మంది హాజరయ్యారు. సివిల్ కేటగిరిలో 266 మంది, ఏపీఎస్పీ కేటగిరిలో 244 మంది అభ్యర్థులు ఉన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఏఓ రవిరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ స్కూళ్ల డీఐగా దావూద్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉర్దూ స్కూళ్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా పి.దావూద్ నియమితులయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నార్పల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న దావూద్‌కు ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ నియమించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


తాడిపత్రి టౌన్: మండలంలోని యల్లనూరు రోడ్డులో ఉన్న పప్పుల బట్టీ సమీపంలో ముళ్ల పొదల్లో సోమవారం పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. జూదరుల నుంచి రూ.32,350 నగదు, ఆరు సెల్‌పోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

అనంతపురం సిటీ: స్థానిక ఐటీఐ మిట్ట వద్ద రైలు ఢీకొని ఓ వృద్ధుడు (60) మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, తెలుపు రంగు చొక్కా, నీలం రంగు కట్ బనియన్, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94414 45354కు సమాచారం అందించాలని కోరారు.

ఆంధ్రా ఉమెన్ క్రికెట్ జట్టులో ఐదుగురికి చోటు


అనూష

అనంతపురం: సెప్టెంబర్ 2 నుంచి విశాఖపట్నం వేదికగా జరిగే ఉమెన్ టీ-20 క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో జిల్లాకు చెందిన ఐదుగురికి చోటు దక్కింది. గతంలో భారత మహిళా క్రికెట్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన బి.అనూషతో పాటు కదిరికి చెందిన ఎస్.అర్షియా, అనంతపురానికి చెందిన బి.నేహ, ఎ.హన్సిరెడ్డి, డి.చక్రిక ఉన్నారు.

మా ప్రేమకు నువ్వే అడ్డు!

- యువతిని బెదిరించిన ప్రేమికులు
- మనస్తాపంతో ఆత్మహత్య


పూజారి స్వాతి (ఫైల్)

అనంతపురం: 'నువ్వే మా ప్రేమకు అడ్డు.. నువ్వు లేకపోతే మేం ప్రశాంతంగా ఉంటాం. నువ్వు చనిపోవాల్సిందే' అంటూ ఓ యువతిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేమికులు ప్రేరేపించిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొందిపల్లి గ్రామానికి చెందిన పూజారి స్వాతి (21) అనంతపురంలోని నలంద డిగ్రీ కళాశాలలో యూజీ మూడో సంవత్సరం చదువుతోంది. ఓ వైపు చదువుకుంటూనే మరో వైపు దీపు రక్త పరీక్ష కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. అక్కడ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న అరుణ్ కుమార్, మరో టెక్నీషియన్ అయిన యువతితో స్వాతి స్నేహపూర్వకంగా ఉంటూ వచ్చింది. ఈ క్రమంలో అరుణ్ కుమార్, స్వాతి ప్రేమలో పడ్డారు. విషయం తెలుసుకున్న సదరు యువతి సోమవారం ఉదయం స్వాతికి ఫోన్ చేసి మందలించింది. 'నా ప్రియుడిని ఎలా ప్రేమిస్తున్నావు.. మేమిద్దరమూ ముందు నుంచి ప్రేమలో ఉన్నాం. నీవు అడ్డు వస్తున్నావు. ఈ విషయం ల్యాబ్‌లో, మీ హాస్టల్‌లో అందరికీ చెబుతాను' అని బెదిరించింది. అదే ధోరణిలో అరుణ్‌కుమార్ కూడా ఆ యువతికి వత్తాసు పలుకుతూ స్వాతిని బెదిరించాడు. దీంతో మనస్తాపం చెందిన స్వాతి... సోమవారం ఉదయం 7.30 గంటలకు తాను ఉంటున్న బాలాజీ లేడీస్ హాస్టల్‌లో గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్వాతి తండ్రి పూజారి నాగభూషణం ఫిర్యాదు మేరకు అనంతపురం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: ఈ నెల 30, 31 తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా బాలికల జట్టును సోమవారం ఆర్డీటీ స్టేడియంలో ఎంపిక చేశారు. ఈ మేరకు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు బి.గాయత్రి, కార్యదర్శి బి.గంగమ్మ తెలిపారు. ఎంపికైన వారిలో టి.లక్ష్మి, సురేఖ, మౌనిక, ధరణి, నాగప్రసన్న, లక్ష్మి యాదవ, టి.లావణ్య, పల్లవి, మూర్తిత, రాధిక, కేవీ ధరణి, బసంతి, కస్తూరి, శ్రావణి, ఎస్.జాహ్నవి, సుప్రియ, రిస్మిత ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ సి.వెంకటేశులు అభినందించారు.

క్లుప్తంగా

బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయం



రక్తదాతలను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

అనంతపురం కల్చరల్: బ్రహ్మకుమారీల సామాజిక సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల రెండు రోజుల పాటు నిర్వహించిన రక్తదాన శిబిరాలు ముగిశాయి. సోమవారం నగరంలోని పాతూరులోని బ్రహ్మకుమారీల సేవా కేంద్రంలో ముగింపు వేడుకలు నిర్వహించారు. బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారద నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు హేమంత్‌కుమార్, ధనుంజయ, కోఆర్డినేటర్ భార్గవి తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. మానవతా విలువలను బోధించే సంస్థలు ఆచరణలోనూ పాటిస్తూ ఆదర్శప్రాయంగా ఉన్నాయని కొనియాడారు. బ్రహ్మకుమారీల స్ఫూర్తితో అందరూ రక్తదానాన్ని బాధ్యతగా తీసుకుందామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఈగా పదోన్నతి

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న టీ రాజశేఖర్ రెడ్డికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతిపై ఆయన ఆదోని మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. పదోన్నతి పొందిన రాజశేఖర్‌రెడ్డిని తోటి సిబ్బంది అభినందించారు.

నేడు మట్టి గణపతుల పంపిణీ

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీ నాయకుడు అనిల్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ ఉంటుంది. ఉదయం 11 గంటలకు మొదటి రోడ్డు రొద్దం సర్కిల్‌లో జరిగే ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంత చంద్రారెడ్డి ప్రారంభిస్తారు. పర్యావరణ హితం కోసం మట్టి వినాయకులనే పూజిద్దామని అనిల్‌కుమార్‌గౌడ్ సూచించారు.

పశుశాఖలో మహిళా ఉద్యోగుల విచారణ

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఇరువురు మహిళా ఉద్యోగుల మధ్య ఇటీవల తలెత్తిన వివాదంపై సోమవారం విచారణ చేపట్టారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం, చివరకు ఎస్సీ కమిషన్ దృష్టికి వెళ్లడంతో దీనిపై నివేదిక సమర్పించాలని పశుశాఖ గుత్తి ఏడీ భారతిని విచారణాధికారిగా నియమించారు. ఈ క్రమంలో విచారణాధికారి స్థానిక జేడీ కార్యాలయంలో ఇరువురు ఉద్యోగులతో పాటు మరికొందరు అధికారులు, విశ్రాంత అధికారులను పిలిపించి లిఖిత పూర్వక వాంగ్మూలం తీసుకున్నట్లు సమాచారం. ఇరువురిని రాజీ కుదిర్చి సమస్యను పరిష్కరించడానికి ఆ శాఖ పెద్దలు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు జేడీతో పాటు విచారణాధికారి నిరాకరించారు.

అనుమతిలేని కట్టడాలు



ఏప్రిల్ 30న అశోక్‌నగర్‌లో ఓ బహుళ అంతస్తు భవనం స్టిల్ట్ తొలగిస్తున్న దృశ్యం



ప్రస్తుతం అదే భవనం స్టిల్ట్‌లో వ్యాపారాలు ఇలా...

- గ్రౌండ్‌ఫ్లోర్/సెల్లార్లలో అనధికారిక నిర్మాణాలు
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై సర్వత్రా విమర్శలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో అనధికారిక నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో కీలక అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. లోపాయికారి ఒప్పందాలతోనే ఇలా చూసీ చూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 30న అశోక్‌నగర్‌లో యల్లమ్మ దేవాలయం ఎదురుగా ఓ బహుళ అంతస్తుల భవనం స్టిల్ట్ (గ్రౌండ్‌ఫ్లోర్)లో అనధికార నిర్మాణాలు చేపట్టారు. మూడు షాపులను నిర్మించేందుకు గోడలు కట్టేసి ప్లాస్టింగ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇక ఆ సమయంలో అక్కడున్న స్థానికులు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ అధికారి రంగంలోకి దిగారు. అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా ఎలా చేపడతారంటూ జేసీబీని రప్పించి అక్రమ నిర్మాణాలు తొలగించారు.

4 నెలల్లోనే యూటర్న్

అనధికార నిర్మాణమంటూ తొలగించిన టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారి నాలుగు నెలల్లో 'యూటర్న్' తీసుకున్నారు. అశోక్‌నగర్‌లో జరుగుతున్న ఆ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. అటువైపు తొంగి చూడలేదు. ఇంకేముంది యజమాని యథేచ్ఛగా స్టిల్ట్‌లో మూడు గదుల నిర్మాణాలు చేపట్టి.. అందులో షాపులు ఏర్పాటు చేశారు. ఇది ఒక్క అశోక్‌నగర్‌లో మాత్రమే కాదు. నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. సెల్లార్లలో అనధికారిక కట్టడాలు చేపట్టినా 'చూస్తాం.. చర్యలు తీసుకుంటాం' అంటూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

విశ్వమాతకు సేవా నీరాజనం



దివ్యాంగులు, అంధులకు స్టిక్స్ అందిస్తున్న తరిమెల రమణారెడ్డి, చిత్రంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, రిటైర్డు జడ్జి కిష్టప్ప, డాక్టర్ హేమలత

అనంతపురం కల్చరల్: విశ్వమాత మదర్ థెరిస్సా 116వ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలతో నీరాజనాలందించారు. నగరంలోని రామచంద్ర నగర్‌లోని అంధ బాలికల ఆశ్రమ ప్రాంగణంలో 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 160 మంది దివ్యాంగులు, అంధులు, అనాథలకు ముఖ్య అతిథులు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, విశ్రాంత న్యాయమూర్తి క్రిష్టప్ప, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ సుకన్య, సామాజిక సేవా కార్యకర్త గోంధు నిహార్ చేతుల మీదుగా కాస్మోటిక్స్, నిత్యావసరాలు, బ్లైండ్ స్టిక్స్‌తో పాటు స్టడీ మెటీరియల్ అందించారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వక్తలు మాట్లాడుతూ మదర్ థెరిస్సా స్ఫూర్తితో ఎంతో మంది సేవా రంగం వైపు మళ్లడం ఆనందకరమన్నారు. అమ్మ సంస్థ ద్వారా రెండు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. తరిమెల రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అన్నే ఫెర్రర్ మరో మదర్ థెరిస్సాలా సేవలందిస్తున్నారని, ఆమె స్ఫూర్తితో తాను సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానని చెప్పారు.

నిరుద్యోగులను విస్మరించిన ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

అనంతపురం అర్బన్: యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని సూపర్ సిక్స్‌లో పేర్కొన్న హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న ధ్వజమెత్తారు. సోమవారం క్లాక్ టవర్ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న మాట్లాడుతూ ఏడాది దాటినా నిరుద్యోగ భృతిపై అతీగతీ లేదన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుద్యోగుల సమస్య పరిష్కారంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వందల పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని, రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయని కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రచారం చేస్తున్నారే తప్ప.. ఆచరణలో ఏదీ లేదన్నారు. ఉపాధి కోసం యువత వలస బాటపట్టిందన్నారు. అన్ని జిల్లాల్లోనూ ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసలు నివారించాలన్నారు. వీటన్నింటిపై ముఖ్యమంత్రి తన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యువజన సంఘాలు, యువతను ఐక్యం చేసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్, నాయకులు నూరుల్లా, సురేంద్రబాబు, అశోక్, చరణ్, నెట్టికల్లు, నూర్‌బాషా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వివరాలకు ఇంకెన్నాళ్లు తిరగాలి?



'గ్రీవెన్స్'లో ఆవేదన వ్యక్తం చేస్తున్న వెంట్రాముడు

అనంతపురం కార్పొరేషన్: తన ఇంటికి సంబంధించిన అసెస్మెంట్ వివరాలు కావాలని నెల రోజులు తిరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో ఓ విశ్రాంత ఉద్యోగి విసిగిపోయాడు. ఇంకెన్నాళ్లు తిరగాలి.. తన నుంచి ఇంకేమైనా ఆశిస్తున్నారా.. ఉంటే అదైనా చెప్పండంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్న వెంకట్రాముడు అనే విశ్రాంత ఉద్యోగి తన ఇంటి అసెస్మెంట్ వివరాలు 1978 నుంచి ఇప్పటి వరకు కావాలని నగరపాలక సంస్థను సంప్రదించాడు. అయితే సంబంధిత విభాగ అధికారులు ఈ రోజు.. రేపు అంటూ తిప్పుతున్నారు. వృద్ధాప్యం మీద పడినా.. ఆపసోపాలు పడుతూ వస్తున్నా ఆయనకు వివరాలు ఇచ్చే నాథులే లేరు. సోమవారం 'గ్రీవెన్స్'కు హాజరై మరోమారు తన గోడు వెల్లబోసుకున్నాడు. అసలు వివరాలు ఎందుకు ఇవ్వడం లేదు.. ఇంకేమైనా 'కావాలా'.. ఏదో ఒకటి స్పష్టంగా చెప్పండంటూ వేడుకున్నారు.

గాండ్ల కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి

అనంతపురం టవర్‌క్లాక్: గాండ్ల కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని దక్షిణ భారతదేశ గాండ్ల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తక్షణం గాండ్ల కార్పొరేషన్‌కు చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను నియమించాలని కోరారు.

హామీల అమలుకు చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్: శ్రీరామిరెడ్డి నీటి సరఫరా స్కీమ్ కార్మికులకు బకాయిలు చెల్లిస్తామని మీరు ఇచ్చిన హామీ పూర్తిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఆ స్కీమ్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జి.ఓబులు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లించాలంటూ కార్మికులు సమ్మె చేసిన సందర్భంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. ఫేస్-4 కార్మికులకు బకాయి వేతనాన్ని కాంట్రాక్టర్ చెల్లించలేదన్నారు. అదే విధంగా 16 నెలల పీఎఫ్ బకాయి చెల్లించాలన్నారు. ట్రంక్, బెళుగుప్ప కార్మికులకు పీఎఫ్ 23 నెలల బకాయి చెల్లించాలన్నారు. తదితర హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పీజీ డిప్లొమా ఇన్ ఫారిన్ లాంగ్వేజెస్ ఫలితాల విడుదల



ఫలితాలను ప్రకటిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆర్డీటీ సంస్థ చేపట్టిన పీజీ డిప్లొమా కోర్సులు అయిన ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ పరీక్ష ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత సోమవారం విడుదల చేశారు. ఫ్రెంచ్ కోర్సులో 20, స్పానిష్‌లో 16, జర్మన్ కోర్సులో 19 చొప్పున మొత్తం 55 మంది ఉత్తీర్ణత పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, సీఈ శ్రీరాములు నాయక్, ఆర్డీటీ ఫారిన్ లాంగ్వేజెస్ ప్రిన్సిపాల్ వి.గీతాంజలి, ఆర్డీటీ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జి.మోహన్ మురళి, ఫారిన్ లాంగ్వేజెస్ డైరెక్టర్ జోష్ యాంటినో, ఎస్కేయూ పీఆర్వో రాంగోపాల్ పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు విరాళం



చెక్కులను అందజేస్తున్న సాదిక్‌వలి

అనంతపురం రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని ఎంఎస్ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో గణేశ్ విగ్రహాలకు విరాళాలు అందించారు. సోమవారం రుద్రంపేట పంచాయతీలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులకు సంస్థ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాదిక్‌వలి ఆధ్వర్యంలో లక్ష రూపాయలు విలువ చేసే చెక్కులు అందజేశారు. సాదిక్‌వలి మాట్లాడుతూ వినాయక చవితి పండుగను కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు విరాళాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రుద్రంపేట ఎంపీటీసీ- 4 సభ్యురాలు మహబూబ్‌బీ, ఎంఎస్‌సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మట్టి వినాయకుల పంపిణీ

అనంతపురం అర్బన్: వినాయక చవితిని పురస్కరించుకుని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు జరగనున్న కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి.జగదీష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలన్నారు.

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్తు

అనంతపురం కల్చరల్: గణేశ్ చతుర్థి సందర్భంగా వీధుల్లో కొలువుదీరే మండపాలకు తమ ఒత్తిడి వల్లే ఉచిత విద్యుత్తు ఇవ్వాలని నిర్ణయించిందని గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ విక్రమ్, విశ్వేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తాము కోరిన విధంగా సింగిల్ విండో పద్ధతిలో గణేష్ మండపాల నమోదు, ఎలాంటి రుసుము చెల్లించకుండా అన్ని గణేష్ ఉత్సవ సమితులతో సమన్వయం వంటి అంశాల తీర్మానానికి గణేష్ ఉత్సవ సమితి కృషి చేసిందని పేర్కొన్నారు. సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న సాయి ట్రస్టు ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మట్టి వినాయకుల పంపిణీ జరిగింది. మునిసిపల్ కాంప్లెక్స్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొని నగరవాసులకు మట్టి వినాయకులనందించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం అందరూ నడుం బిగించాలని సూచించారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత 20 ఏళ్లగా మట్టి వినాయకులనే పూజించాలని చెపుతూ మట్టి వినాయకులను ఉచితంగా అందిస్తున్నామని, ఇంకా కావాల్సిన వారు తమ సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వేదపండితులు బాలాజీ శర్మ, సంస్కార భారతి లక్ష్మి, రాఘవేంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో నాయీబ్రాహ్మణుడు బలవన్మరణం

అనంతపురం: నగరంలోని మంగళవారి కాలనీలో ఓ నాయీబ్రాహ్మణుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు, నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వజ్రకరూరు మండల కేంద్రానికి చెందిన శ్రీరాములు (49) జీవనోపాధి కోసం 30 ఏళ్ల కిందట అనంతపురం వచ్చాడు. మంగళవారి కాలనీలో ఉంటూ హౌసింగ్ బోర్డు వద్ద షేవింగ్ సెలూన్ నిర్వహిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం బయటి వ్యక్తులతో వడ్డీలకు అప్పులు చేశాడు. వచ్చిన సంపాదనతో అప్పు చెల్లించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో అప్పుల వారి నుంచి ఒత్తిళ్లు పెరిగిపోవడం, పెళ్లయ్యి 20 ఏళ్లయినా సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందిన శ్రీరాములు సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పీఏబీఆర్‌లోకి తగ్గిపోయిన ఇన్‌ఫ్లో

- డ్యాంలోకి చేరుతున్న 555 క్యూసెక్కుల నీరు



కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లోకి ఇన్‌ఫ్లో తగ్గి పోయింది. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ఫేజ్-2కు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేశారు. దీంతో పీఏబీఆర్‌లోకి కేవలం 483 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఇంతకు ముందు 1672 క్యూసెక్కులు వచ్చేవి. హెచ్చెల్సీ ద్వారా 72 క్యూసెక్కుల నీరు చేరుతోంది. సోమవారం నాటికి డ్యాంలో 4.386 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం ఇరిగేషన్ అధికారులు తెలిపారు. సత్యసాయి, శ్రీరామరెడ్డి, అనంతపురం, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు, నీటి ఆవిరి, లీకేజీల రూపంలో రోజుకు సుమారు 130 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆయకట్టుకు సాగు నీరందించాలి

గార్లదిన్నె: మండల పరిధిలోని ఎంపీఆర్ డ్యాం నుంచి డిస్ట్రిబ్యూటరీ కాలువలకు నీరు విడుదల చేసి హెచ్చెల్సీ ఆయకట్టుకు సాగు నీరు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఎంపీఆర్ డ్యాంలో నీరు పుష్కలంగా ఉందని, 5వ డిస్ట్రిబ్యూటరీ కాలువకు నీరు విడుదల చేస్తే యర్రగుంట్ల, మంటిమడుగు, కల్లూరు, కల్లూరు అగ్రహారం, ఇల్లూరు, కల్లుమడి, తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, బందార్లపల్లి గ్రామాల వరకూ సాగునీరు వెళ్తుందన్నారు. ఆగస్టు పూర్తి కావస్తున్నా ఐఏబీ సమావేశం నిర్వహించకపోగా, ఆయకట్టుకు సాగు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు చెప్పడం లేదన్నారు. రైతులకు 90 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు అందించాలన్నారు. అలాగే రైతులకు సకాలంలో యూరియా అందించాలన్నారు.అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రంను తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.